బీఆర్‌ఎస్‌తోనే సబ్బండ వర్గాల సంక్షేమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్ రెడ్డి



పెద్దాపూర్‌లో దాసరికి మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు

- పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డి

కాల్వశ్రీరాంపూర్: బీఆర్‌ఎస్‌తోనే సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలు అందాయని, కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. బుధవారం కాల్వశ్రీరాంపూర్, జాఫర్‌ఖాన్‌పేట, పెద్దరాతుపల్లి గ్రామాల్లో ప్రచారం లో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాతో వ్యవసాయాన్ని పండుగలా చేసుకుంటున్నారన్నారు. ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష, ఎంపీటీసీలు రమాదేవి, పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్‌తో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ ఐల రమేశ్, ఎంపీపీ బాలాజీ రావు, పల్లా సురేశ్, బుర్ర శ్రీనివాస్, అజయ్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ రూరల్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి మద్దతుగా చిన్న బొంకూర్‌లో రాష్ట్ర సివిల్ సప్లై చైర్మన్ రవీందర్‌సింగ్, ఎస్సీసెల్ విభాగం క్యాదాసి చంద్రమౌళి, నాయకులు ప్రచారం నిర్వహించారు.

జూలపల్లి: పెద్దాపూర్‌లో ఎంపీపీ రమాదేవి రాంగోపాల్‌రెడ్డితో కలిసి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ ఇంటింటా బ్యాలెట్ నమునాతో ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గంగయ్య, తదితరులున్నారు.

ఓదెల: పొత్కపల్లి, మడక గ్రామాల్లో పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి సతీమణి పుష్పలత ఇంటింటి ఎన్నికల ప్రచారం చేశారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ బీజేవైఎం పట్టణ శాఖ అధ్యక్షుడు మొలుగూరి సాగర్ బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎలిగేడు: మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ కవ్వంపల్లి లక్ష్మీదుర్గయ్య ఆధ్వర్యంలో, ధూళికట్టలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌ను నమ్మి ఆగం కావొద్దు

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు



కాటారం: ప్రచారంలో మాట్లాడుతున్న పుట్ట మధు



పలిమెల: మాట్లాడుతున్న వాసుకే యాదవ్

కాటారం: మంథనిని ఏళ్లుగా పాలించి అథోగతి పాలు చేసిన కాంగ్రెస్‌కు ఓటువేసి ప్రజలు ఆగం కావొద్దని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. కాటారం మండలం చింతకాని, అంకుషాపూర్, కొత్తపల్లిలో ప్రచారం నిర్వహించారు. బీసీ బిడ్డగా తాను ఎమ్మెల్యే స్థాయికి ఎదగడం ఇష్టం లేక కాంగ్రెస్ అభ్యర్థి అనేక కుట్రలు పన్నుతున్నారన్నారు. పుట్ట మధు సమక్షంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, బీఆర్‌ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, నాయకులు రాజబాబు, దుర్గం తిరుపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలిమెల: పుట్ట మధును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని బహుజన సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసుకే యాదవ్ అన్నారు. మండలకేంద్రంలో బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పెద్దపల్లి జిల్లా బీసీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, ఇందారపు మల్లయ్య జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు విజయగిరి సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం: ఓటు వేసేముందు గ్రామాల్లోని ప్రతి కుటుంబంలో చర్చ పెట్టిన తర్వాతే మీ ఓటు నిర్ణయం తీసుకోవాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ పేర్కొన్నారు. పారుపల్లి, అడవి శ్రీరాంపూర్‌లో ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్, నాయకులు పాల్గొన్నారు.

మంథని: గుజరాత్‌తో సహా బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇవ్వని విధంగా రాష్ట్రంలో రూ.4016/ పింఛన్ అందిస్తూ తొమ్మిదేళ్లలో రూ.10,300 కోట్లు కేటాయించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ డా.కె.వాసుదేవ రెడ్డి అన్నారు. మంథని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుకు మద్దతుగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల పింఛన్ లబ్ధిదారుల ఆశీర్వాద సభకు మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు ఓటువేయాలని కోరారు.

హామీల అమలులో బీఆర్‌ఎస్ విఫలం



రాములపల్లిలో ఓట్లు అభ్యర్థిస్తున్న లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి: హామీల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు ఆశీర్వదించి తనకు ఒక్కసారి ఎమ్మెల్యేగా ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు. నాయకులు గజ్జల స్వామి, మాజీ విండో చైర్మన్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వెల్గొండలో కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం

బుగ్గారం: మండలంలోని వెల్గొండ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

ధర్మారం: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ధర్మారం మండల కేంద్రంలో బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు బొల్లి స్వామి, పాలకుర్తి రేణుకాదేవి, రాజలింగయ్య, మాజీ ఉపసర్పంచ్ శంకరయ్య, నాయకులు రాజేశం, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే మళ్లీ చీకటి రోజులే



పార్టీలో చేరిన వారితో మంత్రి కొప్పుల

ధర్మపురి: కాంగ్రెస్ వస్తే మళ్లీ చీకటి రోజులేనని, 50 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ చేసింది ఏమిటని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని బూరుగుపల్లె, తిమ్మాపూర్, రాయపట్నం గ్రామాల్లో బుధవారం ప్రజా ఆశీర్వాద యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులు, యువకులను అవ్వా మీ ఓటేసి గెలిపించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ ఉన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరిక

గొల్లపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఇస్రాజ్‌పల్లికి చెందిన పలువురు జెడ్పీటీసీ గోస్కుల జలేందర్ ఆధ్వర్యంలో బుధవారం మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

కొప్పుల గెలవాలని మల్లన్నకు ముడుపు

కొప్పుల ఈశ్వర్ భారీ మెజార్టీతో గెలుపొందాలని కోరుతూ బుధవారం పలువురు దివ్యాంగులు మల్లన్నపేట మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపు కట్టారు.

అందుబాటులో ఉంటా ఆదరించండి

బుగ్గారం : ప్రజలందరికీ అందుబాటులో ఉంటా మరోసారి ఆదరించండని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని గోపులాపూర్, చందయ్యపల్లె, చిన్నాపూర్ గ్రామాల్లో గడప గడపకూ తిరుగుతూ ప్రచారం చేశారు.

క్లుప్తంగా

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



సుల్తానాబాద్ : మండలకేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. బుధవారం దాతల సహకారంతో ఏర్పాటుచేసిన ధ్వజస్తంభాన్ని గురుస్వామి ప్రదీప్ కుమార్ మంత్రోచ్ఛరణల మధ్య ఏర్పాటు చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు భిక్ష ప్రారంభించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి దీక్షాపరులు, తదితరులు పాల్గొన్నారు

నగదు, ఫోన్ అప్పగింత



నగదు అప్పగిస్తున్న సిబ్బంది

సుల్తానాబాద్ : పెద్దపల్లి మండలం పెద్ద బొంకూర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి శాంతమ్మ (55) మంగళవారం పెద్దకల్వల డిగ్రీ కళాశాల వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొనడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 సిబ్బంది పెద్దపల్లిలోని ఆస్పత్రికి తరలించారు. శాంతమ్మ ఫోన్‌తో పాటు నగదును అంబులెన్స్‌లో మర్చిపోగా బుధవారం సుల్తానాబాద్‌లో వారి కుటుంబ సభ్యులకు అందించినట్లు 108ఈఎంటీ నరేశ్ పైలెట్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి



పెంచికల్‌పేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాములు



మాట్లాడుతున్న ఎస్సై రవిప్రసాద్

కమాన్‌పూర్: ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్సై భేతి రాములు అన్నారు. మండలంలోని పెంచికల్‌పేట గ్రామంలో బుధవారం ఎన్నికల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన వారు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

రామగిరి: ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని ఎస్సై కటికె రవి ప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని బేగంపేట గ్రామంలో ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. బాధ్యతగా, తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లను ప్రలోభపెడితే చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట ఏ ఎస్సై చేరాలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం



మంథనిలో పహారా కాస్తున్న పోలీసులు

రామగిరి: మహాముత్తారం మండలం మీనాజీపేట వద్ద ఓడేడ్ సర్పంచ్ బక్కారావుపై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బంద్ ప్రకటించారు. వ్యాపారులు దుకాణాలను మూసి ఉంచి బంద్‌కు మద్దతు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలను మూసివేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై రవిప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. ఎంపీపీ ఆరెల్లి దేవక్క, జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణా రెడ్డి, నాయకులు కాటం సత్యం, కొంరయ్య గౌడ్, సిద్దం మురళీకృష్ణ , రాం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంథని: మహాముత్తారం మండలంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల పరస్పర దాడులను నిరసిస్తూ ఆయా పార్టీలు ఇచ్చిన నియోజకవర్గ స్థాయి బంద్ ప్రశాంతంగా ముగిసింది. మంథనిలో కాంగ్రెస్ నాయకులు వ్యాపార, వాణిజ్య సంస్థలను మూసివేయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. బుధవారం ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యురాలు కమలాకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 110 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్మాసిస్ట్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై

జూలపల్లి: మండలకేంద్రం నుంచి పెద్దాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై బుధవారం ఎస్సై వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల్లోని సామగ్రి, బ్యాగులను నిశితంగా పరిశీలించారు. ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఏఎస్సై, సిబ్బంది ఉన్నారు.

'దాడులు సరికాదు'

కోల్‌సిటీ: మంథని నియోజకవర్గంలోని ఓడెడు సర్పంచ్ సిరికొండ బక్కారావుపై దాడి చేయడాన్ని జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆరేపల్లి హరీశ్ ఖండించారు. శాంతియుతంగా ఎన్నికల్లో గెలవాలి తప్ప, ఇలా దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న మహిళా భక్తులు

సుల్తానాబాద్ : మండలకేంద్రంలోని శివాలయంలో కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో మహిళలు భజన కార్యక్రమం చేపట్టారు. గురువారం ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా పూజారి రమేశ్, మహేశ్ తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



గోదావరిఖనిటౌన్: ఐబీ కాలనీలోని సింగరేణి క్వార్టర్ వద్ద షెడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభం తుప్పు పట్టి ప్రమాదకరంగా మారింది. టీ2–613 క్వార్టర్ వద్ద విద్యుత్ స్తంభం ఎన్నో రోజులుగా తుప్పు పట్టి ఉండగా ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని కాలనీలోని సింగరేణి కార్మిక కుటుంబాలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే నూతన స్తంభాన్ని ఏర్పాటు చేసి ప్రమాదబారినుంచి కాపాడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



ఆర్థికసాయం అందజేత

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌కు రంగు ప్రశాంత్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రఘువీర్‌సింగ్ బాధిత కుటుంబానికి రూ.5వేలు పంపించగా సభ్యులు పల్లె సురేశ్ అందజేశారు. ఈ సందర్భంగా రఘువీర్‌సింగ్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కన్నం రమేశ్, ఆరేళ్ల శ్రీనివాస్, రంగు మల్లయ్య, గుర్రం సంపత్, వీరేశం , ఆకుల తిరుపతి, మల్లేశ్, గుర్రం లచ్చయ్య, తదితరులున్నారు.

పబ్లిక్ టాయిలెట్స్ లేక తిప్పలు

- వసతుల కల్పనలో బల్దియా అధికారులు విఫలం
- ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



అంబేద్కర్ చౌరస్తా ప్రధాన కూడలి

రామగుండం: కనీస మౌలిక సౌకర్యాల కల్పనలో బల్దియా అధికారులు విఫలమయ్యారు. రామగుండం పట్టణ పరిధిలోని అంబేద్కర్ కూడలి, రైల్వేస్టేషన్ ఎదుట పబ్లిక్ టాయిలెట్స్ నిర్మిస్తామని ప్రతిపాదనలకే పరిమితమవుతున్నారు. రామగుండం మండలకేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారితోపాటు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు నిత్యం వేలాది మంది రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి ప్రదేశాల్లో ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం మాత్రం చేపట్టలేదు. పలుసార్లు స్థానిక కార్పొరేటర్లు బల్దియా అధికారుల ఎదుట మొరపెట్టుకున్నా నిర్మాణాలకు ప్రతిపాదనలు పూర్తయ్యాయని చెబుతున్నారే తప్ప కార్యరూపం దాల్చడం లేదు. ఇప్పటికైనా బల్దియా అధికారులు ప్రజలు, రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం సత్వరమే టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం వద్దు



బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన నిషేధం అంటూ బోర్డులు ఏర్పాటు చేయడంలో మాత్రం అధికారులు ఉత్సాహం చూపుతుంటారు. ప్రజల సమస్యలను గుర్తించాలి. పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించడంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలి.

– ఖాజా మొహినొద్దీన్, స్థానికుడు

ఇబ్బంది పడుతున్నాం



గ్రామాల నుంచి వచ్చేవారు తన హోటల్‌లో టిఫిన్ చేసి అత్యవసరాలు తీర్చుకోవడం కోసం మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ఏ ప్రాంతంలోనైనా పబ్లిక్ టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయి. కానీ ఇక్కడ మాత్రం కానరావడం లేదు.

– అమ్జద్, హోటల్ నిర్వాహకుడు


సత్వరమే నిర్మించాలి



పనులు ముగించుకొని స్వగ్రామాలకు వెళ్లడం కోసం బస్టాప్ వద్దకు వచ్చేవారు టాయిలెట్స్ ఎక్కడ అంటూ నిత్యం ఆరా తీస్తున్నారు. మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బల్దియా అధికారులు సత్వరమే టాయిలెట్స్ నిర్మించాలి.

– అయూబ్, పండ్ల వ్యాపారి

రాంగ్ రూట్.. రైట్ రైట్



సుల్తానాబాద్ : రాజీవ్ రహదారిపై వాహనాలు రాంగ్ రూట్‌లో వెళ్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని పూసాల శివారు ప్రాంతంలో రైస్‌మిల్లులు ఉన్నాయి. అక్కడికి వెళ్లేందుకు ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాలు రాంగ్ రూట్‌లో వెళ్తున్నాయి. పోలీసులు జరిమానా విధించినా వాహనదారుల్లో మార్పులేదు. అధికారులు ప్రమాదాల జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు